
'రాంషా'

# నువ్వా కావాలి! కృష్ణయ్యా కావాలి!

సాయంకాలం!

నందగోపుడి యింటికి అల్లంత దూరంలో ఓ యిల్లు.

ఇంటి ముందు పెద్ద పెద్ద వీథి అరుగులు

హవేలీ లోపలికి వెళ్లగానే పంచ.

ఆ గడప దాటి లోపలికి అడుగు పెడితే పేద్ద.... విశాలమైన నట్టిల్లు.

దాని కటూ యిటూ రెండు పెద్ద గదులు.

ఒకటి పడక గది....

దానికెదురుగా వుండేది సామానుల కొట్టు.

నేరుగా వెళ్లిపోతే అటుప్రైపు పెరడు. పెరటి నిండా రకరకాల మొక్కలు.

పెరడుకి దించిన వసారాలో ఆగ్నేయమూలలో వంటగది. ఈశాన్యంగా తడకల చాటు గది. వీటికి అటుగా ఓ మూల స్నానాల గది.... పెరట్లో మరో మూల మందారం. పక్కనే గుబురుగా పందిరల్లుకున్న మల్లె. దాని పక్కనే జాజి విరజాజి నేల మొక్కలయినా విరగబూసి పరిమళాలు విసుర్తున్నాయి. అటువైపు సంపెంగ. దాని మధుర పరిమళం రేపల్లె అంతా నిండుకుంటుంది.

మందారానికి సంపెంగకీ మధ్య శ్రీతులసి కోట. దాని చుట్టూ అరుగు

అదిగో - ఆ అరుగు మీద ఓ ఆకారం

ఆ ఆకారానికి ఓ పేరుంది. అది చంద్రయ్య!

చంద్రయ్యంటే ఆ వ్రేపల్లలో ఎవరికీ తెలీదు రోహిణి మొగుడంటే చప్పున గుర్తు పడతారు. దానిక్కారణం రోహిణి సోయగాలు. రోహిణి అందచందాలు.. రోహిణి వయ్యారాలు రోహిణి కలివిడితనం రోహిణి నృత్యం యింకా యింకా....

శ్రీతులసికోట అరుగుమీద కూర్చున్న చంద్రయ్య ఎదురు స్నానాల గదివైపే చూస్తున్నాడు. గదిలోంచి యింకా స్నానం ముగియనట్టుగా అపుడపుడూ అవుతున్న నీళ్ల సవ్వడి. లోపల చల్లగా గోరువెచ్చని నీటితో స్నానం చేస్తోంది రోహిణి. ఆమె స్నానం తీరుని తలపోస్తున్న చంద్రయ్య అట్టుడికినట్టుడికి పోతున్నాడు.

కోపం ఆపుకోలేక తనలో తను సణుక్కున్నాడు.

'గడియా! రెండు గడియలా?

జామైంది స్నానాల గదిలో దూరి'

రుద్దిందే రుద్దుకుంటూ పునుగు అరగదీస్తూ వుంటుంది. సున్ని వాడేస్తూ వుంటుంది.

ఎక్కడ ఆ చక్కని తనువు అరిగిపోతుందో అని తను తోపేస్తూ అరచేతుల మధ్య చందమామలా అల్లారు ముద్దుగా మోసుకుంటూ వుంటే...తనేమో అదేం పట్టనట్టు పునుగుబిళ్ల అరగదీసి అరగదీసి రుద్దుతుంది.

సాయంకాలమైతే సరి!

స్నానాల గదిలో దూరుతుంది. తోమి తోమి వళ్లంతా పరిమళాలు నిండి ప్రవహించి గుబాళించి చుట్టూ కమ్ముకునేలా బయటికి వస్తుంది. నడుస్తోన్న సంపెంగో, మల్లో, జాజో, మరువమో అన్నట్టుంటుంది.

ఆపై పడక గదిలో దూరి చేసుకునే సింగారానికి హద్దుండదు అంతూ లేదు. పునుగు, జవ్వాది, కస్తూరి... ఒకటేమిటి? రకరకాల సుగంధ ద్రవ్యాలు మధురానగరాన్నించి తనే తెప్పించినవి పులుము కుంటుంది. ముఖానికి గంధప్పొడి అలదుకుంటుంది. ఆ మీదట కస్తూరి తిలకం దిద్దుకుంటుంది.

అక్కడికి అలంకారం పూర్తవుతుంది.

ఆపై చీరా రవికా సింగారింపు

అబ్బో!

యవ్వనమంతా ప్రస్ఫుటీకరించేట్టు... పిగిలి పటపటమంటుందా అనేట్టు రవిక తొడిగి, దానికి తగిన జతగా చీర సింగారిస్తుంది. కరి మబ్బులాంటి రవికైతే యమునానది వరణం చీర కట్టుకుంటుంది. నీలి మబ్బురంగు రవిక తొడిగితే నెమలికంఠం రంగు చీర చుట్టుకుంటుంది. వెన్నముద్ద రవికైతే పాలసంద్రం చీర సింగారిస్తుంది.

ఇక అంతటితో సింగారింపు పూర్తిచేసి -

ముంజేతి నుంచి మోచేతి దాకా అదే రంగు మట్టి గాజులు తొడుక్కుంటుంది. రోజూ సాయంకాలం గాజుల మలారం గలగలలు వినాల్సిందే! ఆపై నడుస్తూ వుంటే ఘల్లు ఘల్లు మనే కాలిగజ్జెలు అలంకరించుకుంటుంది.

ఆ మీద-

అడుగు యింట్లో నిలబడదు
భువన మోహినిలా బయల్దేరుతుంది
తను ఆపలేడు -
అడ్డగించవలేడు -
అనుసరించనూ లేడు -
అధఃకరించ లేడు -
ఆపలేని వ్యామోహం ! ఓపలేని అనురాగం !
అసలు తనే తన అలివిమాలిన ప్రేమతో ఆమెని హద్దులు దాటించాడా?
ఆలి ఆలోచనల్లో కాలం గడిచిపోయింది
వెన్నెల బారెడెక్కింది
పన్నమో! పున్నమి తర్వాతి పాడ్యమో !
ఈ గందర గోళంలో తనకు లెక్కెక్కడ తెలుస్తుంది

చంద్రయ్య ఊహ పోహల మధ్య వూగులాడ్తుంగా చంద్రకాంతిలా బయటికి వచ్చింది రోహిణి! ఒళ్లంతా కళ్లయ్యేలా చూస్తూ గుప్పుమంటున్న పరిమళాలకి ముగ్ధుడౌతూ.... పలుకరించరాక.... మంత్రరుద్ధభుజంగంలా ఆమె వెనకే నడిచాడు.

మధ్య యింటి గుండానే పడక గదిలోకి నడిచింది రోహిణి. ఎదురుగా నిలువెత్తు అద్దంలో అందాలు చూసుకుంటూ సింగారించుకుంది. అద్దంలో ఆమె రూపు ఆమెనే మోహింప చేసింది ఎర్ర మందారం రంగు రవిక.

దానికి తోడు సంజె కెంజాయ చీర!

మెడలో పుస్తెల తోడు.... అంతే!

చేసుకున్న అలంకారం చాలని ఇటు తిరిగింది రోహిణి... ఎదురుగా చంద్రయ్య.

'రోహిణీ!'

నీవు నందయ్య ఇల్లు పోనే వలదు
నీవు బృందాటవికిని పోనే వలదు.
నాకు ఇష్టము లేదు
ఊళ్లో అమ్మాయిలంతా పోతే పోనీ-
నీవు నందయ్య ఇల్లు పోనే వలదు"
గబగబా అన్నాడు చంద్రయ్య

మేఘం లేని ఉరుము ఉరుములేని పిడుగు.

నిర్ఘాంతపోయింది రోహిణి.

ఏమిటి? ఏమిటి మీరంటున్నది అన్నట్టు చూసింది.

ఆ చూపులు ఇంద్రగోపచాపాలై అతని ఎదనాటాయి.

అయినా నిమ్మళించుకుని అన్నాడు మెల్లిగా - మృదువుగా -

"గ్రామమందు నాకు తలవంపులుగా ఉంది.

ఊరు విరగబడి చెప్పుకుంటే వుంది"

ధనుర్భంగాల్లా ఆమె భ్రూ చాపాలు విరిగి ...కలిశాయి

"ఈ వూళ్లో కాపురాలు లెక్కలేదు. ఇక్కడి ఆడవాళ్ల అదుపు మీరి పోయారు. మగవాళ్లంటే బొత్తిగా లెక్కలేదు.. అయినా ఆదంతా నాకెందుకు? నువ్వు పోరాదు. వద్దన్నా నువ్వు వినకుండా గడప దాటావో - మళ్లీ నా గడప తొక్కనీను. నిజం! నిజం చెబుతున్నాను. నవ్వులాట కాదు."

పాల సముద్రం మీద వెన్నెల విరిసినట్టు ఆమె పెదాల మీద తారట్లాడిన నవ్వు.... ఒకప్పుడు అదెంతో ముద్దు కొలిపేది. ముచ్చట కొలిపేది. ముద్దూ ముచ్చటా తీర్చేది. పెదాలు చీలి చిట్లి పోతాయా అన్నంతగాఢంగా ముద్దు పెట్టుకునేలా.....కౌగిట్లో ఎముకలు పటపటలాడి.... పిట పిటలాడే యవ్వనం నలిగి పోయేలా రెచ్చగొట్టేది....కానీ యిప్పుడో.....

'నిజం రోహిణీ! ఒట్టు....గడప దాటి వెడితే తిరిగి గడప తొక్కనియ్యను. నీ బలకిష్టయ్య మీద ఒట్టు-"

చప్పు అనేశాడు.

అనేశాక మనస్సులో 'ఛ! ఛ! ఆజ్ఞకు కూడా అర్హత లేదా! అదుపుకి కూడా ఆ బాలకిష్టయ్యేనా?' అనుకునేంతలో.....

కాటుక దిద్దిన రోహిణి కళ్లల్లో కారుమేఘాలు తొణికిసలాడాయి.

"ఒట్టు బాలకిష్టయ్య మీద అన్నావు! అంత ఒట్టు ఎందుకయ్యా సామి! నీవు భరత్వు! నేను భార్యను!!

నిన్ను వదిలి వెళ్లి కాపురానికి నీళ్లు వదులుకోవడం......ఛ ఛ! నేను చేయనే చేయను"

క్షణం ఆగి అంది

'నిన్ను వదిలి....వీధిని పడి.... బతికేందుకోసం...... అమ్మా బువ్వ! అయ్యా బువ్వ! అని అడుక్కోనా? ఊహూఁ అంతదాకా దిగజారలేను-'

ఒక్కక్షణం ఆగింది. మళ్లీ ...ఆగి....ఆగి.....మెల్లిగా అంది. "ఈ వూళ్లో ఈ వ్రేపల్లెలో న్యాయసభ వుంది కదా! సామీ! అందులో అంతా పెద్ద పెద్ద వాళ్లే వయస్సు మళ్లిన వృద్ధులే సభ్యులు కదా! నీవు వయస్సులో వున్నావు.....నిండా పాతిక నిండీ నిండని నిన్ను ఆ సభలో ఎందుకు చేర్చుకున్నారు?

నువ్వు న్యాయంగా ఉంటావని!

న్యాయవర్తివి న్యాయమూర్తివి అని!

దీనిలో న్యాయం చూడు!

దున్నపోతు ఈనిదంటే దూడను కట్టేయ్ అనే పద్ధతిలో నడిచేదానికి నువ్వెందుకు సామీ!

ఊళ్లో చాలా మంది....చాలా మందేమిటి....వూరి నిండా ఉన్నారు...... అందుకు

బాగా ఆలోచించు ఒకమాటు ఒకమాట

చిన్ని కృష్ణమ్మపై ఒట్టు పెట్టుకున్నావ్

చిన్న అప్రతిష్ఠ....ఇంత రగడ దేన్ని గూర్చి?

ఊళ్లో వాళ్ల గురించి....ఎవడ్ని గురించి ఒట్టు వేశావో.....ఒట్టూ వాడిమీదే వేశావు

నేను నీ భార్యను-

నీవే విచారించుకో!

కృష్ణయ్యా? నేనా?

ఎవరు కావాలో కోరుకో అని....నన్నా....నీభార్యను అయిన నన్ను అడుగుతావేమిటి సామీ!

అయినా-

నేను కృష్ణుడు కావాలని ఎందుకు కోరుకోకూడదు?

నేను నిన్ను వద్దన లేదే?

నిన్ను కాదని కృష్ణుడిని కోరడం లేదే!

నాకు నువ్వూ కావాలి!

కృష్ణుడూ కావాలి!!"

ఎదలోని వలపు.....ఎదలోని కోరిక.....బయట పెట్టింది రోహిణి. చెప్పాల్సింది పూర్తిగా చెప్పేశానని నిలిచి నిలదీసినట్టు చూడసాగింది.

సతి మనస్సు తెలిసిప చంద్రయ్య.........?

(కవి సామ్రాట్ విశ్వనాథ వారి శ్రీకృష్ణ సంగీతం లోని ఇహపరాలకి